# పాలిట్రిక్స్

ఎ న్టీ ఆర్ లేబర్ మినిష్టర్‌ని ట్రాప్‌చేసి పదవిలోనుంచి పీకి పారేయడం నాకు థ్రిల్లింగ్ కలర్ పిక్చర్ చూస్తున్నట్లనిపించింది

ఆ పద్ధతే ఉపయోగించి మా ఊళ్ళో - లంచాలు తెగ తినేస్తున్న చీడపురుగులు కొందరిని ఏరిపారేయాలని నిర్ణయించుకున్నాను ఆ చీడపురుగుల లిస్టులో మా ఊరి గవర్నమెంట్ డాక్టర్‌ది మొదటి పేరు కాబట్టి వెంటనే ఓ పాకెట్ టేప్ రికార్డర్, ఓ అయిదువేల రూపాయల నోట్లకట్ట (నేను వాటిమీద ముందే సంతకాలు చేశాను) తీసుకొని ఆయనింటికి చేరుకొన్నాను

విజిటర్స్ రూమ్‌లో అప్పటికే నలుగురు కూర్చుని ఉన్నారు నాపేరు పిలవగానే జేబులోని టేప్‌రికార్డర్ ఆన్‌చేసి లోపలికెళ్ళాను "నమస్కారమండీ! మా ఆవిడకు ఫలానా జబ్బుకి ఆపరేషన్ చేయాలని అన్నారండి! తమరు ఇలాంటి ఆపరేషన్లు అద్భుతంగా చేస్తారని తెలిసింది కనుక ఈ ఐదు వేలూ తీసుకొని..." అంటూ నోట్లకట్ట ఆయన ముందుంచాను

డాక్టర్ తనచేతిలోని బాల్‌పెన్‌తో ఆ నోట్లకట్టలు మళ్ళీ నాదగ్గరకు తోసేశాడు "పిచ్చివాడా! ఎంత తప్పు పని చేస్తున్నావ్! మానవసేవయే మాధవసేవ అని మన పెద్దలు నుడివిన మాట మరచితివా! వైద్యో నారాయణోహరి, అన్న లోకోక్తిని కూడా మరచితివా! రోగ పీడితులయిన ప్రజలను బాధా విముక్తులుగా వించుటలో యున్న ఆనందము ఈ తుచ్ఛమయిన, క్షణికమయిన- పాడు డబ్బు ఇస్తుందా? వెళ్ళు నాయినా! ఆ డబ్బు తీసికెళ్ళి లోకకల్యాణార్ధము ఖర్చు చేయుము నేను అందరికీ ఉచితముగా సేవ జేయుటయే పరమార్ధముగా భావించుచున్నవాడను! మీ ఆవిడకు తప్పక ఆపరేషన్ చేసెదను నాయనా తోడ్కొని రమ్ము హాస్పిటల్‌కు" నేను జేసేదిలేక డబ్బుకట్ట తీసుకొని బయటికొచ్చాను

ఆడాక్టరుకి నేనే ఎన్నోసార్లు మా బంధువులకు ఆపరేషన్లు చేయడానికి గాను లంచం ఇవ్వక తప్పలేదు. మరి ఇంత హఠాత్తుగా ఎలా మారిపోయాడా అనేది అర్ధం కావటంలేదు

అక్కడి నుంచీ లిస్ట్‌లో రెండో నంబర్లో ఉన్న ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి అధికారి ఇంటికి చేరుకొని, జేబులోని టేప్‌రికార్డర్ ఆన్ చేశాను

"మావాడి పేరు చాలా అడుగునపడి ఉందండీ! దాన్ని అర్జంటుగా పైకితెస్తే బాంక్‌లో ఉద్యోగం వస్తుంది అందుకు ప్రతిఫలంగా ఈ అయిదువేలు..."

అతను నా మాట పూర్తి కానీయలేదు
"శివశివా! ఎంతటిమాట అంటివి! లంచగొండితనము మహాపాతకమను మాట నీకు తెలియదా? కేవలం న్యాయ రక్షణ కొరకే ప్రభుత్వమునన్నీ పదవినందుకొంచిన దన్న విషయము నేనెట్లు మరువగలను? అయిదువేల రూపాయలు ఈ క్షణమున వచ్చును మరొక్క క్షణమున పోవును కాని 'కీర్తి' అట్లు కాదుగదా! కలకాలము నిలచియుండును! దయచేసి ఇంకొక్క క్షణముకూడా ఆ పాపపు డబ్బు నాముందు చకుము! తీసుకొని వెళిపొమ్ము"
అంటూ కళ్లు మూసుకుని శివనామం జపించసాగాడు ఆ నోట్లకట్ట జేబులో ఉంచుకుని బయటికొచ్చాడు నాకు మతి పోయినట్లయింది ఈ అధికారే అనేకమంది దగ్గర లంచాలు తీసుకుని, ఎన్నో అవకతవకలుచేసి అనేకసార్లు సస్పెండ్ కూడా అయాడు అలాంటి లంచగొండి ఇంత హఠాత్తుగా లంచద్వేషి అయిపోయాడా!
ఎటూ తోచక తిన్నగా ఇరానీ హోటల్ కెళ్ళి టీ ఆర్డర్ చేశాను లిస్ట్‌లో తరువాతి నంబర్లలో ఉన్న ఇతర డిపార్ట్ మెంట్ అధికారుల దగ్గరకు వెళ్ళాలనిపించటంలేదిప్పుడు
"హలో" అంటూ వచ్చాడు మా ఫ్రెండ్!
"ఏమిటలా ఉన్నావ్?"
నేను టేప్‌రికార్డర్, నోట్లకట్టల కథ చెప్పాను
వాడు పగలబడి నవ్వాడు
"పిచ్చివాడా! ఎవరో కొత్త బిచ్చగాళ్ళు తప్పితే డైరెక్ట్‌గా లంచాలు ఎవరూ తీసుకోరు! అంతా "త్రూ ప్రాపర్ చానెల్" జరుగుతుంది! మన డాక్టర్‌కి లంచం ఇవ్వాలంటే ఫలానా మెడికల్ షాపులో మందులమ్మే వాడిని పట్టుకుని లంచం వాడికే అందజేయాలి! మన ఊరి ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి అధికారిని పట్టుకోవాలంటే ఫలానా బార్ అండ్ రెస్టారెంట్‌లో పనిచేసే బేరర్‌ని పట్టుకుని లంచం ఇవ్వాలి! పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో పని జరగాలంటే ఊరి మధ్యలో ఉన్న కల్లు కాంపౌండ్ ఓనర్ బామ్మర్దికి నోట్ల కట్ట ఇచ్చేయాలి-ఇలా... ఒక్కొక్కరికీ ఒక్కొక్క..."
"ఆగాగు-" అన్నాను హడావుడిగా.
"ఏమిటి?"
"మరి మన లేబర్ మినిష్టర్ సంగతేమిటి?"
"నేనూ అదే చెప్తున్నాను స్వామీ! ట్రాన్స్‌పోర్ట్ మినిష్టరుమీదా హెల్త్ మినిస్టర మీదా, ఎడ్మినిస్ట్రేషన్ మినిష్టరు మీద కూడా లంచాలు తింటున్నారన్న అభియోగాలున్నాయి! కానీ లేబర్ మినిస్టర్ ఒక్కరే ఎలాదొరికినట్లు?" ప్రశ్నించాడు.
ఓ క్షణం ఆలోచించేసరికే నాకు హఠాత్తుగా జ్ఞానోదయమయింది సమాధానం తెలిసిపోయింది ఇప్పుడిలాంటి టేప్ రికార్డర్ పద్ధతులు అవుట్ డేటెడ్!

అరణ్యఘోష్